క్లుప్తంగా

మరిడమ్మ తల్లికి స్వర్ణ, రజత పుష్పార్చన



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవతా దృక్పథం అవసరం



జంతువుల ప్లాస్టిక్ బొమ్మలతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నవీన్ నాని

పెద్దాపురం: ప్రతి విద్యార్థి మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలని చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు జంతువులపై మనిషి వ్యవహరించాల్సిన విధానంపై జంతు ప్రేమికుడు నవీన్ నాని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంశంలో విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. అలాగే ఉదయం పూజిత సూర్యశ్రీ కరాటే శిక్షణ, నీలపాల కృష్ణ కర్రసాము నేర్పించారు.

టెన్త్ సప్లిమెంటరీకి 77 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం 152 మంది పరీక్షలు రాయాల్సి ఉందని ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 49 శాతం మంది అంటే 75 మంది మాత్రమే పరీక్షలు రాశారన్నారు. మండల పరిధిలో సామర్లకోటలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలను సప్లిమెంటరీ పరీక్షలకు కేంద్రాలుగా ఇవ్వడం జరిగిందన్నారు.

బాటిళ్లలో పెట్రోలు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల అనంతరం హింసాత్మక సంఘటనల నేపథ్యంలో బంకుల్లో ఖాళీ బాటిళ్లలో పెట్రోలు వేయరాదని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పెట్రోల్ బంక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోలు పోయవద్దని సూచించారు. గ్రామాల్లో కిళ్లీ, కిరాణా దుకాణాల వద్ద బాటిళ్లలో పెట్రోలు విక్రయించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలుల్లో ఉన్న నేపథ్యంలో అధికారుల సూచనలు పాటించాలన్నారు. బాటిళ్లలో పెట్రోలు వేసిన వారి సమాచారాన్ని అధికారులకు తెలియపరచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.

సుభద్ర ఆర్కేడ్‌లో అగ్నిప్రమాదం

రూ.30 వేల ఆస్తి నష్టం

కాకినాడ క్రైం: కాకినాడ భానుగుడి కూడలిలో ఉన్న వ్యాపార సముదాయాల కేంద్రం సుభద్ర ఆర్కేడ్‌లో ఓ వ్యాపార సంస్థలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. లలితా ట్రేడర్స్ పేరుతో కొనసాగుతున్న సదరు సంస్థకు విద్యుత్ పంపిణీ అవుతున్న మీటర్ ప్యానళ్లు షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతై ఆ మంటలు వ్యాపించాయి. దుకాణ యజమాని జి.శివకుమార్ సమాచారంతో అక్కడికి చేరుకున్న సాలిపేట ఫైర్ అధికారి సుబ్బారావు ఆయన బృందం మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది నష్ట తీవ్రతను రూ.30 వేలకు పరిమితం చేశారు.

తడిసి ముద్దయిన పిఠాపురం

కుండపోతతో చల్లబడిన వాతావరణం



కొత్తపల్లిలో చల్లబడిన వాతావరణం



గొల్లప్రోలులో కురుస్తున్న వర్షం



పిఠాపురంలో వర్షంతో జలమయమైన ప్రధాన రహదారి

పిఠాపురం: గత నాలుగు రోజులుగా ఎండలు మండిపోగా, శుక్రవారం ఉదయం ప్రచండ భానుడి భగభగలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ క్రమంలో సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని వాతావరణం మారిపోయింది. వాన చినుకులతో మొదలైన వర్షంతో ప్రజలు సేదతీరారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం మొదలైంది. ఉదయం ఎండ మొదలైనప్పటికీ.. మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారి కారుమబ్బులు కమ్ముకున్నాయి. చిరు జల్లులతో ప్రారంభమై సాయంత్రం వరకు వర్షం కురవడంతో అప్పటి వరకు వేసవి తాపంతో అల్లాడిన జనం సేదతీరారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణం మారినట్టు భావిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో అల్పపీడనం వాయుగుండంగా మారి.. భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలకు ఊరట కలిగిస్తున్నాయి. భారీ వర్షంతో పిఠాపురం పట్టణంలో పలు వీధులు జలమయం కాగా, డ్రైన్లు పొంగిపొర్లాయి. పిఠాపురం మండలం గోకివాడ ఏలేరు కాలువలో పిడుగు పడడంతో ఓ గేదె మృతి చెందింది.

సేదతీరిన జనం

కొత్తపల్లి: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షంతో సేదతీరారు. ఉదయం నుంచీ ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షం కురవడంతో రైతులు బెంబేలెత్తారు.

ఊరటనిచ్చిన వాన

గొల్లప్రోలు: పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. ఈదురు గాలులతో పాటు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఈ వర్షం వేసవి దుక్కులకు అనుకూలమని రైతులు చెబుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత

- జేసీ, పిఠాపురం ఆర్‌ఓ రాంసుందర్‌రెడ్డి



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న జేసీ, పిఠాపురం ఆర్‌ఓ రాంసుందర్‌రెడ్డి

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూంలకు పటిష్ట భద్రత కల్పించినట్టు జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ ఎస్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూంను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరచిన పిఠాపురం నియోజకవర్గ ఈవీఎంలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూంలకు భద్రత పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ, ఎప్పటికప్పుడు స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పరిశీలిస్తున్నామని చెప్పారు. నిఘా వ్యవస్థను అనునిత్యం పరిశీలిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన ఆయన భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రెండు గంటల పాటు కుంభవృష్టి

- చెరువుల్లా మారిన రహదారులు, బస్సు కాంప్లెక్స్ ఆవరణ
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం
- రైతులకు మేలేనంటున్న అధికారులు



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో కురుస్తున్న వర్షం



చెరువులా మారిన బస్సు కాంప్లెక్స్

సామర్లకోట: సుమారు రెండు గంటల పాటు కుంభవృష్టిగా వర్షం కురిసింది. రుతు పవనాలు వెనుకకుపోయాయనే వార్తలతో ప్రజలు నిరాశకు గురయ్యారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలితో కూడిన వర్షం కురిసింది. దాంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్సు కాంప్లెక్స్ చెరువుగా మారింది. రైల్వే స్టేషన్, జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, దేవీచౌక్, సంపెంగతోట, వీర్రాఘవపురం, సీతాఫలదొడ్డి, బ్రౌన్‌పేట, సత్యనారాయణపురం, భాస్కర్‌నగర్ నీట మునిగాయి. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షం రైతులకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. గత నెల రోజులుగా పంట భూములు ఖాళీగా ఉండడంతో వర్షాలకు తమ తమ పొలాలను దుక్కి దున్నుకునే అవకాశం ఉంది. ప్రస్తుత సార్వా సీజన్‌లో 22,500 ఎకరాల్లో వరి సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- మేడపాడు వంతెన మీదుగా రవాణా
- పట్టించుకోని అధికారులు



జి. మేడపాడు గ్రామంలో రైతుల పొలాల్లో సాగుతున్న మట్టి తవ్వకాలు

సామర్లకోట: మండల పరిధిలోని జి.మేడపాడు రైతుల పంట భూముల నుంచి 15 రోజులుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామంలోని గోదావరి కాలువపై బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన వంతెన సుమారు ఆరేళ్ల క్రితం శిథిలమవడంతో గ్రామానికి చెందిన దాత నలమాటి జానకిరామయ్య సుమారు 25 లక్షలతో వంతెన మరమ్మతులు చేయించారు. రైతుల పంట పొలాల నుంచి మట్టి టిప్పర్లతో 50 నుంచి 60 టన్నుల బరువుతో వంతెన మీదుగా వెళ్లడం వల్ల వంతెన పాడైపోయే ప్రమాదం ఉన్నదని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా పరిషత్ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంట భూముల నుంచి తవ్విన మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రైతుల సొంత పంట భూముల నుంచి మట్టి తవ్వే సమయంతో తప్పని సరిగా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మట్టి తవ్వితే కఠిన చర్యలు

గ్రామంలో మట్టి తవ్వకంపై ఫిర్యాదులు రావడంతో వెంటనే తవ్వకాలు నిలిపివేయాలని తమ వీఆర్వోల ద్వారా శుక్రవారం ఆదేశాలు ఇచ్చాము. అయితే రైతులు ఒక పొలం నుంచి మరో పొలానికి మట్టి తీసుకుంటున్నట్లు చెప్పారు. జి.మేడపాడు గ్రామం నుంచి సామర్లకోట మీదుగా టిప్పర్ల ద్వారా మట్టి రవాణా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. మట్టి తవ్వకాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకొంటాం.

– జి.శ్రీనివాస్, తహసీల్దార్

నియోజకవర్గంలో 43 సర్వీస్ ఓట్లు

- ఆర్డీఓ జేఎస్ రామారావు
- లెక్కింపు రోజు 8 గంటల లోగా అందే ప్రతి బ్యాలెట్ స్వీకరణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల స్వీకరణ కొనసాగుతోందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 141 మంది సర్వీస్ ఓటర్లను గుర్తించామన్నారు. వారందరికీ ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ అందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ 43 మంది సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు ఆర్‌ఓ కార్యాలయానికి చేరాయని ఆర్‌ఓ తెలిపారు. వాటిని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్టు తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీ ఉదయం 8 గంటల లోగా వచ్చిన సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తామన్నారు. సెగ్మెంట్ పరిధిలో 2,15,095 ఓటర్ల జాబితాతో పాటు విడిగా 141 సర్వీస్ ఓటర్లను లెక్కించాల్సి ఉంటుందన్నారు. సర్వీస్ ఓటర్లు 141 మంది ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారని, కేవలం 43 మందివి మాత్రమే సర్వీస్ పోస్టల్ బ్యాలెట్ అందాయని ఆర్డీఓ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లు తంతి తపాల శాఖ ద్వారా అందుతున్నాయని, ఇంకా గడువు ఉన్నందున అవి మాకు అందినంత వరకు స్వీకరించి వాటిని కూడా కౌటింగ్ కేంద్రం వద్దకు చేరుస్తామని రామారావు తెలిపారు. నాలుగో తేదీన నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు





సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల నేతలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

- పార్టీల నేతలు సంయమనం పాటించాలి
- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగా, పోలింగ్ సైతం ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్, పోలీస్ యాక్టు 30 అమలులో ఉంటుందని చెప్పారు. అందరూ ఆయా నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తలను సంయమనం పాటించేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే, వారి జీవితాలు చిన్నాభిన్నమవుతాయని హెచ్చరించారు. ఎవరూ వివాదాలకు, ఘర్షణలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ఎవరూ గుంపులుగా తిరగరాదన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో లెక్కింపు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు

- 27 వరకు నీటి సరఫరాకు అంతరాయం
- 12 ట్యాంకర్లతో ప్రతి రోజూ 69 ట్రిప్పుల నీటి సరఫరా
- కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కాకినాడ అచ్చంపేట-ఉండూరు సమీపంలో పైప్‌లైన్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పైప్‌లైన్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్‌ప్లాంట్‌కు వెళ్లే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఈ నెల 23, 24, 25 తేదీలలో 1 నుంచి 13వ డివిజన్ వరకు అంటే శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, గైగోలుపాడు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టామన్నారు. అయితే శుక్రవారం కురిసిన భారీవర్షం వల్ల పైపులైన్ మరమ్మతులకు అంతరాయం కలిగిందని, ఈ నెల 26, 27 తేదీలలో కూడా ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

1 నుంచి 13వ డివిజన్ వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆరు ట్యాంకర్లతో పాటు మరో ఆరు అద్దె ట్యాంకర్లను కూడా రప్పించామన్నారు. వీటి ద్వారా గురు, శుక్రవారాలలో 69 ట్రిప్పుల చొప్పున ప్రజలకు నీరు అందించామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఎదురైతే మొబైల్ నెంబర్లు 98499 06507, 99597 99138, 96767 70461, 98484 71415 నెంబర్లను సంప్రదివచ్చునని కమిషనర్ సూచించారు.

అధికారులు లేక అభివృద్ధి నత్తనడక



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీలో ముఖ్య శాఖల్లో అధికారులు లేక పోవడంతో సంబంధిత శాఖల పరిధిలోని అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. మున్సిపల్ ఏఈ పదోన్నతిపై బదిలీ అయ్యారు. మున్సిపల్ మేనేజరు గత రెండు నెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. రెవెన్యూ అధికారి బదిలీ కాగా అతని స్థానాన్ని ఆరు నెలలుగా భర్తీ చేయలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ అయి ఏడాది కావస్తున్నా ఆ పోస్టును భర్తీ చేయలేదు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటిని పరిశీలించడానికి ఇంజినీరింగ్ శాఖ కీలక బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అలాగే లైటింగ్ విషయంలో ఇంజినీరింగ్ విభాగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. శానిటేషన్ పనులు నిర్వహించడానికి ఇన్‌చార్జి కార్యదర్శి కారణంగా పనులు సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ పూర్తి అయిన వెంటనే మున్సిపాలిటీ పరిధిలో పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరుతున్నారు.

వైభవంగా భావనారాయణుని శ్రీపుష్పయాగం



కళాకారుల నృత్యాల నడుమ ఊరేగుతున్న స్వామివారు



శ్రీపుష్ప యాగోత్సవంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్ప యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదర్శనలు నిర్వహించారు. ఒక్కో ప్రదర్శనకు ఒక్కో వాయిద్యం, ఒక్కో నైవేద్యం సమర్పించారు. 11వ ప్రదర్శనలో కళాకారుల నృత్యాలతోను, 12వ ప్రదర్శనలో మౌనంగానూ స్వామివారిని ఊరేగించారు. అనంతరం రాత్రి 9 నుంచి శ్రీపుష్పయాగం పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు, రామకిరణ్, పద్మనాభాచార్యులు, హరి, శ్రీనివాస్, గిరిబాబు తదితరులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. ఆలయ ఏవో భీమేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. చివరి రోజు శ్రీపుష్పయాగంలో పాల్గొన్న 100 మంది దంపతులకు కొబ్బరిబొండాలతో తాంబూలాలు అందజేశారు.

సాగులో మెళకువలతో మంచి దిగుబడులు

కోటనందూరు: సార్వా సాగులో మెళకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భ్రమరాంబ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం సార్వా సాగులో మెళకువలపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ భ్రమరాంబ మాట్లాడుతూ సాగులో పూర్వ విధానాలు కాకుండా, అధునాతన విధానాలు అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అన్ని రకాల యాజమాన్యాల నిర్వహణతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. రైతుకు ఖర్చు తగ్గించి, దిగుబడి పెంచడమే ఈ శిక్షణ ముఖ్యోద్దేశమన్నారు. విత్తనం ఎంపిక, విత్తనశుద్ధి, నారుమడి, ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీపీఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.